# భయం! భయం!

మరీ చిన్నప్పుడు మనకు భయం అంటే తెలియదు.

పాకే వయసులో రోకలి బండను చూసి ఎర్రగా బలే బావుందే అనుకుని పట్టేసుకుంటాం. నోట్లో కూడా పెట్టేసుకుంటాం అది చూసి మన అమ్మో నాన్నో భయం నేర్పుతారు. లేకుంటే తేలునో, జెర్రినో కూడా పట్టేసుకుంటామని వాళ్ల భయం.



చిన్నప్పుడు ఒకోసారి అన్నం ముద్ద నోట్లో పెట్టనివ్వం. అన్నం తినడానికి పేచీ పెట్టేస్తాం. అమ్మ ఎంత బతిమాలినా తినమంటే తినం. ఇక చూసి చూసి విసుగొచ్చి "బూచిని పిలుస్తా, నిన్నెత్తుకుపోతుంది" అంటూ అమ్మ భయపెడుతుంది. మనమూ భయపడి బలవంతంగా కళ్లుమూసుకుని అమ్మ పెట్టే గోరుముద్దలు మింగేస్తాం.

అలా మనలో భయం ప్రవేశిస్తుంది. తర్వాత భయానికీ మనకీ విడదీయరాని సంబంధం ఏర్పడుతుంది.

అందుచేతనే మహాకవి శ్రీశ్రీ ఆయా సందర్భాలనుబట్టి "భయం లేదు భయం లేదు కలిసిరా, జయం మనది జయం మనది కదిలిరా" అని ధైర్యాన్నిచ్చాడు.

ప్రసిద్ధ రచయిత కాళీపట్నం రామారావు భయం అనే పేరుతో మంచి కథ రాశాడు.

రష్యన్ మహా రచయిత చెహోవ్ గుమస్తా మరణం అనే కథ భయం మీదనే రాశాడు. ఆ గుమస్తాకు అన్నీ భయాలే. నిద్ర లేచింది మొదలు పడుకునే వరకూ అతను ప్రతిదానికీ భయపడతాడు.

ఆఫీసుకు లేటవుతానేమోనని భయం, తీరా ఆఫీసుకు టైమ్‌కే వెళ్ళినా, తమ రాసిందాంట్లో తప్పులున్నాయోమోనని భయం, ఆఫీసరు చివాట్లు పెడతడేమో, ఉద్యోగం లోంచి తీసేస్తాడేమోనని భయం. చివరకు గుమస్తా కేవలం భయంవల్లే మరణిస్తాడు.

భయం ఒక జబ్బు కూడా. అది రకరకాలు. అందుకే అన్ని రకాల ఫోబియాలు, కొందరికి నీటిని చూస్తే భయం. కొందరికి లోతును చూస్తే భయం. కొందరికి ఎత్తును చూస్తే భయం. కొందరికి భర్తలంటే

భయం. కొందరికి భార్యలంటే భయం. కొందరికి ప్రియులంటే భయం. కొందరికి పెళ్లంటే భయం. కొందరికి చావంటే భయం.

బహుశా ప్రాణభయమే అన్ని భయాల్లోకీ పెద్ద భయం. ఈ భయంకూడా రకరకాలుగా ఉంటుంది. ఆరోగ్యానికి సంబంధించి కావచ్చు. శత్రు భయం కావచ్చు.

శత్రుభయం సాధారణంగా సామాన్యుల్లో అరుదు. ప్రముఖులయ్యే కొద్దీ ఈ భయం ప్రముఖమవుతుంది. అందుకే ఎమ్మెల్యేలకూ మంత్రులకూ ముఖ్యమంత్రులకూ ప్రధానులకూ ప్రతిపక్ష నేతలకూ అంగరక్షకులు అవసరమవుతారు. అప్పుడు ఎక్కడ ఎప్పుడు ఏ శత్రువు తన ప్రాణం తీస్తాడేమోననే భయం కొంత తగ్గుతుంది.

ఒకోసారి ప్రజాబలంవల్ల కానీ ప్రజల్లో మమేకం కావాలనే మనోబలంవల్లకానీ కొందరు ప్రముఖుల్లో భయం ప్రభావం ఉండక పోవచ్చు. అలాంటి వాళ్ల ప్రాణాలకు ముప్పు వచ్చిన సందర్భాలూ ఉన్నాయి. రాని సందర్భాలూ వున్నాయి. ఒకోసారి అంగరక్షకుడే కంచే చేనుమేసినట్టు ప్రవర్తించిన సందర్భాలూ వున్నాయి.

అలా అంగరక్షకుడివల్లే ఇందిరాగాంధీ ప్రాణాలు కోల్పోయింది.

సరైన రక్షణ లేకుండా ప్రజల మధ్యకెళ్లి రాజీవ్‌గాంధీ మానవ బాంబుకు బలయ్యాడు.

త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న వాళ్లూ ఉన్నారు. అలాంటి వాళ్లల్లో అప్పటి అమెరికా అధ్యక్షుడు రీగన్ ఒకడు.

ఇక ఈ మధ్య భగవాన్ సత్యసాయి బాబా మరొకడు. ఆయన బతికి బయటపడినా అంగరక్షకులు చనిపోయారు.

సాయిబాబా భగవతుండు కదా, ఆయనకు అంగరక్షకులెందుకు అనే వాళ్లున్నారు.

రాముడు దేవుడే కదా, ఆయనకు సైన్యం వుండేది కాదా, అని బదులిచ్చే వాళ్లున్నారు.

ఏమో, రాముడికీ ప్రాణ భయం ఉండేదేమో అని నసిగే వాళ్లున్నారు.

అంటే, బాబాకు ప్రాణ భయం ఉందంటావా అని కసిరే వాళ్లూ ఉన్నారు.

ఏదేమైనా భయం మనబోటి మానవమాత్రులకే కాదు, దేవుడినని ప్రచారంచేసుకునే సాయిబాబాకూ ఉంది. జీవితంలో భయం కూడా ఒక భాగం.

21.6.93
ఆంధ్రభూమి దినపత్రిక